వారం వారం

# ఆ - కా - శ - వా - ణి
## సంగీత సమీక్ష

'పరుసవేది'

సోమవారం అక్టోబరు 9

### చీరాల వెంకటేశ్వర్లుగారి గానం

దురితకాలపు సంగతులు దులపడంలో వీరికి ఆసక్తిమెండు. అట్టి సంగతులు పాడడంలో ఆక్షేపణలేదు కాని, సరియైన వాతావరణంలో వినబడినప్పుడే ఆ సంగతులకు శోభ. కర్ణాటక సంగీతానికి గమకం జీవమువంటిది. గమక జాతులతో లత వలె రాగాన్ని అల్లుతూ సమయోచితముగా దురితకాలపు సంచారము, రవ్వసంగతులు పువ్వులవలె అక్కడక్కడ వినిపించాలి. అటువంటి గానం మనోహరంగా ఉంటుంది.

మంగళవారం అక్టోబరు 10

### కె. వి. రెడ్డిగారి వైలిను వాద్యం

ప్రతిస్వరానికీ విడమర్చి గమకం వాయించడం రెడ్డిగారు అలవాటు చేస్తేవాద్యం అభివృద్ధి అవుతుంది. అల్లాంటి అలవాటు చెయ్యాలంటే వర్ణం త్రికాలం (ముఖ్యంగా మొదటి కాలం గమక శుద్ధంగా) వాయించడం, దీక్షితులవారి కీర్తనలు చక్కనిపోషణతో వాయించడం అభ్యాసం చెయ్యాలి. గానశైలిని అనుసరించాలి.

బుధవారం అక్టోబరు 11

### మద్దుల పల్లిలక్ష్మి నరసింహశాస్త్రిగారి పాట

పాడదలచిన సంగతుల నిర్ణయించుకుని వరుసగా ఒకదానివెనుక నొకటి త్వరితంగా వప్పగించినట్లు తోచింది. వీరుపాడే సంగీతవిషయంలో నున్న అనుభవజ్ఞానము ప్రదర్శనములో కనబడలేదు. పాడేప్రతీసంగతి సరియైనకాలప్రమాణముతో నిదానంగా విరామం గమనిస్తూ పాడితే వీరుపాడిన విషయమే ఇంకొరుచిగా ఉండియుండును. శాస్త్రిగారు కొంచెం శ్రద్ధవహించాలికాని వీరికిదొక కష్టమైన పనికాదు.

గురువారం క్టోబరు 12

### .పి యస్. వైదేహిగారిపాట

(రాయప్రోలు జానకీదేవిగారికి బదులు)

చక్కని రక్తిమార్గములో గానం చేస్తున్నారీమె. ఇంకా అభ్యాసదశలోనే ఉన్నట్లు తెలుస్తుంది వీరిగానం వింటే. కీర్తన, రాగము స్వరూప జ్ఞానముతో గానం చేశారు. నెరవు స్వరకల్పనలలో ఈమెకు శిక్ష బాగా ఇవ్వాలి గురువు. వరవడిపెట్టి చక్కనిశైలిలో నెరవు స్వరము కొన్ని ఆవర్తములు రాసి వల్లింపించి సాధకము చేయించినా తప్పులేదు. శైలిని చక్కని మార్గములో నడిపించడాని కిదొక మంచి సాధనము. రెండుమూడు కీర్తనలలో ఆ మోస్తరుగా సాధకము చేయిస్తే నెరవు స్వరము పాడే పద్ధతి, ఒడుపు బోధపడి, మనోధర్మశక్తి పరుగెత్తుతుంది,

శుక్రవారం అక్టోబరు 3

### షేక్ చిన్నమౌలా సాహెబ్‌గారి నాగస్వర వాద్యం

హిందూదేశపు జంత్రములలో నాగస్వరం చక్రవర్తి వంటిది. నాదపుష్టిలో అయితేనేమి, గమకజాతులు పలకడంలో అయితేనేమి, ఈ జంత్రాన్ని పోలినది మరొకటిలేదు. కర్ణాటక సం

గీతానికీ జంత్రం అన్నివిధాలా తగినది. అయితే కొంతకాలం క్రిందటివరకూ ఈ వాద్యం ఊరేగింపులలోనూ ఉత్సవాలలోనూ మాత్రం వాయించడానికి అవకాశం ఉండేది. అందువల్ల గంటలతరబడి రాగము వాయించడం, రాగమాలిక పల్లవులు వాయించడం అలవాటైపోయింది. రేడియోలో వాయించవలసి నప్పుడు రాగం క్లుప్తంగా ఐదు, పదినిముషాలకు మించకుండా రాగ స్వరూపం కళ్ళకు కట్టినట్లు వాయిస్తేనే రక్తిగా ఉంటుంది. నాగస్వర వాద్యకులకు చక్కని జ్ఞానం ఉన్నా, రేడియోలో ఈ వాద్యం విన్నప్పుడు తూలికిట్టడం లేదు ప్రతీవిషయమూ ముక్తసరిగా రక్తిప్రదంగా వాయించడంలో కూడా గొప్పతేక పోలేదు. ఈ పద్ధతి నాగస్వర విద్వాంసులు గమనించాలి.

శనివారం అక్టోబరు 14

## ముడికొండాన్ వెంకట్రామయ్యరుగారి గానం

మద్రాసునుండి కొన్సర్టు ప్రోగ్రాం పాడేరు. నేడు వీరిపాటలో విశేషం కాంభోజికీర్తనలో కల్పిత స్వరం. వీరుస్వరకల్పన చేసినరీతి చాలా ప్రతిభా వంతంగా ఉంది. ఈ మా స్వర కల్పన సంగీత విద్వాంసులు గమనించాలి, అలవాటు చెయ్యాలి. సర్వలఘువుగా పాడుతూ, [illegible]లుగా తెగగొట్టి, జంటస్వర ప్రయోగాలతో ప్రవాహానికి లోటురాకుండా పాడారు.

ఆదివారం అక్టోబరు 15

## ఎమ్. రంగనాయకమ్మగారి గానం

శృతిపక్వమైన సన్నని గాత్రం. రవ్వసంగతులు స్వల్పముగా పాడడం వల్ల వాటికి ఉండవలసినంత బిగువురాలేదు. వర్ణం త్రికాలమూ, ముఖ్యముగా రెండు, మూడవకాలములు ప్రతీ ఆకారమునూ బరువుగా, బిగుతుగా పలుకుతూ సాధకముచేస్తే పాటకు కావలసిన బింకము, బరువు వచ్చి ఎక్కువరక్తిగా ఉంటుంది పాట వీరు నేడు పాడిన గుండక్రియ, పూరీకల్యాణి రాగ కీర్తనలు బాగున్నవి.

సోమవారం అక్టోబరు 16

## ఎ. లక్ష్మణరావుగారి గానం

స్వచ్ఛమైన పురుషగాత్రంతో నిర్మలమైన శైలిలో గానంచేశారు వీరు. రాగాలాపనలో వీరికున్న శ్రద్ధ, చాకచక్యము కృతి, స్వరకల్పన పాడడంలో కనుపించలేదు. నేటిరాత్రి కీరవాణిరాగం బాగా పెంచారు. వీరుత్వరలో నే ప్రౌఢమైన శైలి అలవర్చుకుని పేరుతెచ్చుకుంటారని తోస్తుంది.

## బెహతా రాజారావుగారి వీణావాద్యం

ఆనంద భైరవి కీర్తన వాయించిన పద్ధతి బాగుంది. ప్రతీసంగతి పదిలంగా గమకశుద్ధంగా వాయించారు. రాజారావుగారు గానం తీగెలన్నీ మోగిస్తూ గొడవచెయ్యకుండా రాగమే వినబడేలాగ వాయిస్తారు. ఈ పద్ధతి సరియైనది. రాగప్రదర్శనమే మనసులో ఉంచుకొని తానం వాయించడానికి ప్రయత్నించాలి వీణవిద్వాంసులు.

మంగళవారం అక్టోబరు 17

## వెంకమామిడి వీరరాఘవయ్య వైలిను వాద్యం

వాయించి సంతుష్టులు కుతుహలులు లేకుండా వాయించడానికి ప్రయత్నం చెయ్యాలి వీరు. చెయ్యి మంచి సాధకంలో ఉంది. వాయించే ప్రతీ ముక్కా రసవంతముగా నిర్దుష్టముగా ఉన్నదా లేదా అని పరీక్ష చేసుకుంటూ వాయించడం అలవాటుచెయ్యాలి. మంచిసాధకం ఉన్న ఫలితం వాద్యంలో పొల్లులేకుండా ఉన్నప్పుడే కలుగుతుంది. ముఖ్యముగా సంగతుల తూకం గమనించాలి.

## హరి అచ్యుత రామశాస్త్రిగారి గానం

ఫిడేలు వాయించడం పైనున్న శ్రద్ధ సాధకము పాటపై మళ్ళిస్తే వీరిగానమూ బాగుంటుంది. గాత్రాన్ని దారిలోకి తేవాలంటే కష్టపడివేళ సాధకం చెయ్యాలి. సారంగ రాగంలో హరినాగభూషణం గారికీర్తన చాలా బాగుంది.

బుధవారం అక్టోబరు 18

## ఏ శ్రీనివాసన్‌గారి గానం

శంకరాభరణం సావేరిరాగాలలో దీక్షితుల వారికీర్తనలు చక్కగా గానంచేశారు. చాలకీర్తనలు పాడటంలో ఉన్న నిరిచతురత దురితకాల కీర్తనలు పాడేటప్పుడు, కనబడలేదు. దురిత గతిని కీర్తనలు పాడడంలో సొగసులేక పోలేదు. అవిపాడ డానికి పద్ధతి, సర్దుబాట్లు వేరే సాధకం చేస్తేనేగాని అబ్బవు.

గురువారం అక్టోబరు 19

## యామర్తి వరలక్ష్మిగారి గానం

సన్నటిడి గాత్రం. గమకాలు బాగాపలికించగలశక్తి ఉంది. పాడేవిషయాన్ని సంగతుల రూపంగా ఏర్పరుచుకుని ప్రతిసంగతినీ నిండు ఊపిరిలో పలికిస్తే పాటరమ్యంగా ఉంటుంది. ఊపిరి చాలకపోతే అపశ్రుతులు పలుకుతాయి. వీరి తారషడ్జమం చాలాసార్లు నేడు శ్రుతిలో కలవలేదు. దమ్ముచాలక పేమో అని తోచింది. ఆరభిరాగం లోనూ కృతిలోను కూడా "మపదని సరిస" అనేప్రయోగం పదేపదే (నాలుగు సార్లు) వినబడినది. ఈప్రయోగం మూర్ఛనా విరుద్ధమైనది. కృతిలోకి రావలసిన గాయకులు, గాయకులు, ఇల్లాంటిలోట్లు కనబడ నివ్వకూడదు.

శుక్రవారం అక్టోబరు 20

## తెంపల్లి మాణిక్యంగారి నాగస్వరవాద్యం

గానశైలి ననుసరించంలో ఆశక్తి చూపించారు. వాయిస్తున్న జంత్రం, దానిశాలూరు మామూళ్ళు అటుంచి రాగము, స్వరకల్పన క్లుప్తముగా మధురంగా వాయించడం మీద దృష్టి నిలిపితే నాగస్వరవాద్యం చాలా బాగుంటుంది. శ్రుతి శుద్ధ రిషభంలో వినిపించింది. గుడ్డలుకుక్కడంవడం వలన కాబోలు. సరియైన శ్రుతి ధారాళంగా చెవిని పడుతూంటేనే సన్నాయి వాద్యం హాయిగా సోకుతుంది. ఈ విషయం రేడియో శ్రోతలు గమనించాలి.

శనివారం అక్టోబరు 21

## ద్వారం వెంకటస్వామి నాయుడుగారి వైలిను వాద్యం

నేడు మాళవగౌళ విపులంగా వాయించారు నాయుడుగారు. వీరి రాగాలాపన పద్ధతి, స్వర పోకడలు జంత్రముపై పనిధర్మము (టెక్నిక్) ఫిడేలు చేతబట్టిన వారందరూ నేర్చుకోవాలి. మరొక గురువుపద్ద తయారైనా, జంత్ర రహస్యాలు నేర్చుకోడానికి నాయుడుగారిలాంటి కళానిధుల కొంతకాలం ఆశ్రయించడంలో న్యూనత లేదు, ఘనతవుందికాని. సంవత్సరానికొకసారి ఏ వేసంగి శెలవల్లోనో ఒకనెలరోజులు నాయుడుగారి వాద్యం ప్రత్యక్షంగా వింటే, వారి వేళ్ళ సర్దుబాటు, కమాను జాతులు గ్రహించడానికి అవకాశముంటుంది.

## జి కోటయ్యదేవరగారి వీణావాద్యం

సంగీతశైలి గాత్రాన్ని పాడినా జంత్రముపై పలికించినా ఒకటే. అయితే, ఏ జంత్రముపై వాయిస్తే ఆ జంత్రపు ప్రత్యేకత ననుసరించి పనితనము కొంచెం మారవచ్చును. వీణధనమ్మాళ్ వీణ, స్వామినాథపిళ్లే వేణువు, పాపయ్యరు ఫిడేలు వాద్యాలనుండి పాటకులు విషయం ఉన్నదున్నట్టుగా నేర్చుకోవచ్చు సంగీతసామగ్రి ఒకటేగనుక. వీణబాణీ అని ఫిడేలు వాద్యకులు అనుకోనక్కరలేదు. వేణువు కదా అని పాటకులు అశ్రద్ధ చూపనక్కరలేదు. అలాగే పాటశైలిని ప్రతి వాద్యమూ అనుసరించడానికి ప్రయత్నం చెయ్యాలి. ఫలానా జంత్రములోనున్న పట్టు తెగిన గురువు వద్ద అభ్యసించవచ్చును. అప్పుడు వాద్యానికి ఎనలేని రాణింపు వస్తుంది.

ఆదివారం అక్టోబరు 22

## పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారి గానం

కర్ణాటక సంగీత సంప్రదాయము దీక్షితుల వారి కీర్తనలలో బాగా యిమిడి ఉంది. ప్రతి విద్యార్థి దక్షితులవారి కీర్తనలు పాఠంచేసి రాగం పెంచడం, గమకపోషణ మొదలైన విషయాలు నేర్చుకోవాలి. ఈ సంగతి బోధించడానికే కాబోలు పంతులుగారు గౌళ పంచక కీర్తనలు వినిపించారు.

1950 దశకంలో ఆనందవాణి అనే పత్రికలో " ఆకాశవాణి - సంగీత సమీక్ష " శీర్షికతో ప్రచురించబడ్డ వ్యాస పరంపరలోని కొన్ని వ్యాసాలు ఇక్కడ చూడవచ్చు.

ఇలాటివి, మరియు ఆకాశవాణికి సంబంధించిన ఏ చిన్న భాగం అయినా, అది ఆడియో అవ్వొచ్చు, ఫోటో అవ్వొచ్చు, వ్యాసం అవ్వొచ్చు, మరేదైనా అవ్వొచ్చు, అవి మీ వద్ద వుంటే పంచుకోగలరని ఆశిస్తూ....

కాపీరైటు హక్కుల ఉల్లంఘన ఉద్దేశం లేదనీ, లాభాపేక్ష / ధనార్జన ఉద్దేశమంతకన్నా లేదనీ సవినయంగా తెలియచేసుకుంటూ - ఈ వ్యాసాలు ఇక్కడ, ఇలా రేడియో అభిమానులకు అందుబాటులో ఉంచటానికి అభ్యంతరాలు ఎవరికైనా ఉంటే తప్పక తెలియపర్చండి. క్షమాపణలతో వెంటనే తొలగిస్తాను.

భవదీయుడు

మాగంటి వంశీ మోహన్

http://www.maganti.org/